నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 14, 2024 | www.navatelangana.com

## 26 నుండి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 26 నుండి మార్చి 3వ తేదీ వరకు హైదరాబాద్ జీడిమెట్లలోని స్టేట్ ట్రైనింగ్ సెంటర్(ఎస్టీసీ)లో బేసిక్ స్కౌట్ మాస్టర్ గైడ్ కెప్టెన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి, బీఎస్ చీఫ్ కమిషనర్ ప్రణీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. బేసిక్ కోర్సు పర్ స్కౌట్ మాస్టర్ రైడ్ కెప్టెన్ శిక్షణ పొందేందుకు ఆసక్తిగల ఉపాధ్యాయులు తమ పూర్తి వివరాలను ఈ నెల 15లోపు కార్యాలయంలో అందజేయాలన్నారు. అదేవిధంగా స్కౌట్ మాస్టర్‌గా శిక్షణ పూర్తయిన ఉపాధ్యాయులు అడ్వాన్స్ కోర్సు కోసం ఈ నెల 16లోగా తమ వివరాలు తెలియజేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కార్యదర్శి స్వామి 6281966588 నెంబరును సంప్రదించాలని సూచించారు.

## జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి ప్రతిభ కనబర్చారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని కైలాష్ నగర్‌కు చెందిన రాజేశ్వర్-సునీత దంపతుల కుమారుడు మాదస్తు బిట్టు సత్తా చాటాడు. జనవరి 30న నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో ఆల్ ఇండియాలో 96 పర్సంటేల్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ ఘనత సాధించిన విద్యార్థిని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

# 16న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

దేశవ్యాప్తంగా ట్రేడ్ యూనియన్లు, కార్మికులు, రైతులు ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్ కోరారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రోజురోజుకూ కార్పొరేట్ మతతత్వ విధానాలను అనుసరిస్తున్న పరిస్థితి ఉందన్నారు. దీంతో సామాన్య ప్రజలు బతికే పరిస్థితి లేదన్నారు. పారిశ్రామిక ఫ్యాక్టరీలను అంబానీ, ఆదానీకి అమ్ముతూ మోడీ ప్రభుత్వం ప్రజల్లో కులాలు, మతాలతో చిచ్చు పెడుతోందన్నారు. కార్మికుల చట్టాలు, హక్కులను కాలరాసి నాలుగు కోడ్లుగా మార్చి కార్మికులని యజమాన్యానికి బానిసలుగా మార్చే విధానాన్ని తీసుకొస్తుందని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, అన్ని రంగాల సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అలువాల చంద్రయ్య, చాపిలె సాయికృష్ణ, వసాకే సాయికుమార్ పాల్గొన్నారు.

**రెబ్బెన :** బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికవర్గం, రైతుల హక్కులపై దాడి చేస్తోందన్నారు. స్వాతంత్ర్యం పూర్వం నుండి ఉన్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్పొరేట్లకు కట్టు బానిసలను చేయడానికి యత్నిస్తోందని విమర్శించారు. కార్మిక వర్గాన్ని నడిచే యంత్రాలుగా మార్చాలని చూస్తున్నారన్నారు. మరోవైపు అడ్డూ అదుపు లేకుండా పెంచుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. బీజేపీ మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరే విధానాలను తిప్పికొట్టాలంటే ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను సింగరేణి ఓబీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు, ఓబీల్లో ఉన్న అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ముంజం ఆనంద్‌కుమార్

**సమ్మె నోటీసు అందజేత**

ఈ నెల 16న జరిగే దేశవ్యాప సమ్మెలో పాల్గొంటామని సింగరేణి కాంట్రాక్టు కార్మికులు మంగళవారం బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల జేఏసీ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. సింగరేణిలో ఆలిండియాలో అమలవుతున్న హైపర్ కమిటీ వేతనాలు అమలుచేయాలని లేదా జీవో నెంబర్ 22ను అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు భయ్యు మొగళి, రాయిల్ల నర్సయ్య, చల్లూరి అశోక్, కొయ్యాడ సాగర్‌గౌడ్, లహను, తిరుపతి, సుధాకర్, లచ్చులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

**కౌటాల :** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు మంగళవారం జీపీ కార్మికుల జిల్లా అధ్యక్షుడు జాడి మొరేశ్వర్, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మోర్లె నగేష్ ఆధ్వర్యంలో ఎంపీఓ మౌనికకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను అన్ని కార్మిక సంఘాలు ఐకమత్యంగా ముందుకొచ్చి విజయవంతం చేయాలన్నారు.



రెబ్బెన : కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న దూలం శ్రీనివాస్



కౌటాల : సమ్మె నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

## పీఓపీ పరిశ్రమను వెంటనే నిలిపేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనావాసాల్లో ఉన్న పిట్టలవాడలోని పిఓపి పరిశ్రమను వెంటనే నిలిపివేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం), బీఆర్ఎస్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు వార్డు ప్రజలతో కలిసి మంగళవారం పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ బండలను పిండిగా చేసే క్రమంలో దుమ్ము ఇండ్లు, చెట్లు, తినే తిండిపై పడుతోందన్నారు. దీంతో పాటు కట్టెలతో కాల్చే క్రమంలో దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. శబ్ద కాలుష్యంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. 40ఏండ్ల క్రితం ఆయిల్ మిల్ పరిశ్రమకు కేటాయించిన ఈ స్థలం ప్రస్తుతం మూడో యజమాని అయిన పిఓపి యాజమాన్యం చేతిలోకి లీజుకు వెళ్లిందన్నారు. ఒరిజినల్ లీజు యజమానులు వారికి కేటాయించిన పరిశ్రమలను నడపకుండా ఇతరులకు లీజుకు ఇస్తూ ఇతర పరిశ్రమలు నడపడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే కలెక్టర్ స్పందించి పరిశ్రమను నిలుపుదల చేయాలని, లేకుంటే వార్డు ప్రజలతో కలిసి పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, నాయకులు బొజ్జ ఆశన్న, అగ్గిమల్ల స్వామి, వార్డు యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను పిలవకుండా భూమిపూజలా?



నవతెలంగాణ-తలమడుగు

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మి ఎన్ఆర్ఈజీఎస్ పనులకు ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా భూమి పూజలు ఎలా నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్ అన్నారు . మంగళవారం సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రోటోకాల్ పాటించకుండా అధికార అహంకారంతో పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను పిలవకుండా అభివృద్ధి పనులకు భూమిపూజ ఎలా చేస్తారన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రోటోకాల్ పాటించామన్నారు. ఇక ముందు కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ పాటించకుంటే బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీటీసీ చంటి, నాయకులు ఆశన్న యాదవ్, గంగాధర్, మహేష్, మగ్గిడి ప్రకాష్, అభిరాంరెడ్డి, అడెల్లు, రాంకిషన్, గంగారెడ్డి, రాంబాయి, పల్లవి పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఆదివాసీ కళాబృందం ప్రదర్శన



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ కళా బృందం శ్రీధర్ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఆది మహోత్సవం కార్యక్రమంలో పాల్గొంది. దీన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించగా ఆదివాసీ నృత్యాలు అయినటువంటి గుస్సాడీ, డెంసా ఆకర్షణీయంగా నిలిచాయి. దేశ నలుమూలల నుంచి వివిధ ఆదివాసీ కళారూపాలు ప్రదర్శించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రముఖ ఆదివాసీ కళాకారుడు కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ ఆదివాసుల ఔన్నత్యాన్ని, ఉనికిని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. విద్యా వైద్య ఆరోగ్య సాంస్కృతిక రంగాల్లో ఆదివాసులు అభివృద్ధి చెందాలని, దానికి అన్ని విధాలుగా తాము సహకరిస్తామని రాష్ట్రపతి భరోసా కల్పించారు. కార్యక్రమంలో డెంసా నృత్య కళాకారులు తిరుపతి, ప్రవీణ్, చరణ్, రవికిరణ్, నితిన్, దత్తు, గుస్సాడీ నృత్య కళాకారులు సంజీవ్, లక్ష్మణ్, మోతీరాం, దినేష్, డోలు సన్నాయి వాయిద్య కళాకారులు ఆనంద్‌రావు, గంగారాం, భీంరావు, మారుతి పాల్గొన్నారు.

## మానసిక వికలాంగురాలిపై లైంగికదాడి

నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రానికి చెందిన పిట్ల రవి(42) అదే గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలు, మూగ యువతిని తన ఇంట్లోకి తీసుకెళ్లి బంధించి లైంగిక దాడి చేశాడు. గ్రామస్తులు చూడడంతో అక్కడి నుండి పారిపోయాడు. ఈ విషయంపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉపాధ్యాయులు ప్రయోగాత్మక బోధనలు చేపట్టాలి

- ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దిలీప్‌కుమార్
- కొలాం పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు
- విద్యార్థులకు పోటీలు, బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంచేలా ప్రయోగాత్మక బోధనలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కోలాం ఆశ్రమోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన, పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీడీ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందించారు. ముందుగా కుమురం భీం విగ్రహం, సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డీడీ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థులకు సైన్స్ గురించి పూర్తి స్థాయిలో ప్రయోగాత్మకంగా తెలియజేయాలని సూచించారు. కోవిడ్ సమయంలో భారతదేశం ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ అందించిందని, ఈ ఘనత సైన్స్ ద్వారా వచ్చిందన్నారు. చంద్రయాన్ విజయవంతం కూడా ఒక సైన్స్ అని చెప్పారు. విద్యార్థులు సైన్స్ పట్ల అసక్తిని పెంచుకుంటూ ముందుకు సాగాలన్నారు. సైన్స్ దినోత్సవ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, గిరిజన క్రీడాభివృద్ధి అధికారి పార్థసారథి, ఏటీడబ్ల్యూవో నిహారిక, ఆశ్రమోన్నత పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణావ్ పాల్గొన్నారు.




# రైతులను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారు

- మాజీ సర్పంచులకు సన్మాన కార్యక్రమం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పదవీ కాలం పూర్తి చేసుకున్న పార్టీ సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల సర్పంచులను జోగు రామన్న శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్న గాంధీ మాటలను నిజాం చేసేలా మాజీ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశారన్నారు. ప్రతి గ్రామానికి ట్యాంకులను నిర్మించి నీటిని అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసే విధంగా ప్రతిపక్ష బాధ్యతను నేరవేరుస్తామన్నారు. బీఆర్ఎస్‌కు సహనం లేదని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తమపై విమర్శలు మాని ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని హితవు పలికారు. గ్రామాల్లో ప్రతి పేదోడు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేలా కార్యకర్తలు వారికి అండగా ఉంటూ దరఖాస్తులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మనోహర్, రోకండ్ల రమేష్, లింగారెడ్డి, సాజిదొద్దీన్, ప్రహ్లాద్, కుమ్ర రాజు, గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, రాజన్న పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

నవతెలంగాణ - రెబ్బెన

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్రికెట్ కిట్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్, నంబాల మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, కళాశాల క్రీడల ఇన్‌చార్జిలు శ్రీనివాస్, గంగాధర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంప్రదాయ చేతివృత్తులు, హస్తకళాకారులను బలోపేతం చేయడంతో పాటు ఆర్థికంగా చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి, కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి సామర్థ్యాన్ని మెరుగుపరచి ఉత్పత్తి ఉత్పాదకతను పెంచేందుకు పథకం ద్వారా కృషి చేస్తామని తెలిపారు. పథకంలో చేరిన వారికి సర్టిఫికెట్, గుర్తింపు కార్డు, శిక్షణ, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకం, మార్కెటింగ్‌లో ప్రభుత్వ మద్దతు అందించడం జరుగుతుందని తెలిపారు. 18 కుల వృత్తులను ఈ పథకంలో చేర్చడం జరిగిందని తెలిపారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని, కుటుంబంలో 18 సంవత్సరాల నిండిన ఒకరు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. విద్యార్హతతో సంబంధం లేకుండా కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి 5 నుండి 7రోజుల ప్రాథమిక నైపుణ్యం, 15 రోజుల అధునాతన నైపుణ్య శిక్షణ ఇస్తూ రోజుకు 500 రూపాయల భృతి ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి అయిన తర్వాత 15వేల రూపాయల టూల్ కిట్, ధ్రువీకరణ పత్రం అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అర్హులైన అందరికీ లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం రఘు, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతీరామ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హనుమంతరావు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా సమన్వయకర్త రోహిత్ పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ



**పెంచికల్‌పేట్ :** మండలంలోని ఎలుకపెల్లి, గుండ్లపేట్, చెడ్వాయి గ్రామాల్లో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రాజులనాయుడు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి గోదాంలో ఎరువుల నిల్వలను, రిజిష్టర్‌లో నమోదైన ఎరువులను, ఈ-పాస్ నిల్వలను పరిశీలించారు. రైతు ఆధార్ నమోదు చేయకుండా అమ్మకాలు జరుపకూడదని దుకాణదారులను ఆదేశించారు. వారానికి 10 దుకాణాల చొప్పున వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు నిల్వలను తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిని లావణ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | ఫిబ్రవరి 14, 2024 | www.navatelangana.com

## పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

**నవతెలంగాణ-తలమడుగు**

మండలంలోని భరంపూర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.25 లక్షల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నట్టు జెడ్పీటీసీ తెలిపారు. అదే గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. పదో



తరగతి చదువుతున్న విద్యార్థులకు స్నాక్స్ కోసం రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబన్న, ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి, ఎంఈఓ నారాయణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శి అనిల్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రతాప్, బాపురావు, నర్సయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విలేకరులను సన్మానించిన యూసీఎల్ సభ్యులు

**నవతెలంగాణ-ఉట్నూర్**

ఉట్నూర్ క్రికెట్ లీగ్ ఇటీవల విజయవంతంగా ముగియడంతో మంగళవారం యూసీఎల్ సభ్యులు ఉట్నూర్ మండల విలేకరులను, స్థానిక పంచాయతీ ఈఓ శంకర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడాలోనూ ఉన్నతంగా రాణించాలన్నారు. యువతను క్రీడాలో ప్రోత్సహిస్తూ యూసీఎల్ సభ్యులకు తమ సహకారం ఎప్పటికి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, నాయకులు పాల్గొన్నారు.



## మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ జిల్లా నాయకులు



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రాజకీయ సమీకరణలు, తదితర అంశాలపై ఆయనతో చర్చించారు. ఆయనను కలిసిన వారిలో కిసాన్ సెల్ బేల మండల అధ్యక్షుడు ఘనశ్యామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ బేల మండల ఉపాధ్యక్షుడు విపిన్, యువజన కాంగ్రెస్ నాయకులు బొక్రే శంకర్, ఠాక్రే సాగర్ ఉన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక టీటీడీసీ హాల్‌లో సిర్పూర్, ఆసిఫాబాద్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలకు చెందిన అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన అధికారులు స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించేందుకు పీఓ, ఏపీఓ, సెక్టోరల్ అధికారులకు శిక్షణలను అందించాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉంటాయని, రిషిప్షన్ కేంద్రాలు ఆదిలాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్సిల్ పాఠశాల, సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన నియమాలు తూచ తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

**స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ కేంద్రాల పరిశీలన...**

అనంతరం సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల, సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్త, దీపక్ తివారి, ఆయా నియోజక వర్గాల అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## పీజీటీ ప్రభుత్వ కొలువు సాధించిన నవీన్ కుమార్

- బంధుమిత్రుల అభినందనల వెల్లువ

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**



గురుకుల బోర్డు నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణం ఖానాపూర్ కాలనీకి చెందిన ఇజ్జగిరి నవీన్ కుమార్ పీజీటీ కొలువు సాధించారు. 2023 సంవత్సరం ఆగస్టు నెలలో నిర్వహించిన పరీక్షకు సంబంధించి ఫలితాలు తాజాగా వెలువడ్డాయి. మంగళవారం గురుకుల బోర్డు విడుదల చేసిన మల్టిజోన్ తెలుగు ఫలితాల్లో తెలుగు విభాగంలో ఖానాపూర్ కాలనీకి చెందిన ఇజ్జగిరి నవీన్ కుమార్ పీజీటీ తెలుగు విభాగంలో 1:1కు ఎంపికయ్యారు. పొరుగు సేవల విభాగంలోను గతంలో మైనారిటీ గురుకుల పాఠశాలలో పనిచేశారు. మల్టీ జోన్‌లో తీవ్ర పోటీ ఉన్నప్పటికీ కష్టపడి చివరికి ఎట్టకేలకు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆయనను అభినందించారు. కొలువు సాధించిన నవీన్ కుమార్ మాట్లాడుతూ ఇది ఉద్యోగ నామ సంవత్సరమని అందరూ కూడా తమ ప్రిపరేషన్ కొనసాగించి, మంచి ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం : కంది శ్రీనివాస్‌రెడ్డి



**నవతెలంగాణ-జైనథ్**

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో జాతీయ ఉపాధిహామీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో రూ.25లక్షలు, ఖాప్రి రూ.10లక్షలు, కరంజిలో రూ.8లక్షలతో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్త శుద్ధితో పని చేస్తుందని తెలిపారు. ప్రజలకు ఆశలకు నెరవేర్చేందుకు రేవంత్ సర్కార్ మంచి ప్రజాపాలన సాగిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని అన్నారు. అంతకు ముందు శ్రీ లక్ష్మి నారాయణ స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ, ఎంపీటీసీ కొడిచెర్ల సుదర్శన్, లక్షిపూర్ గ్రామ ఎంపీటీసీ మనోజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, యాల్ల పోతా రెడ్డి, బాయిన్‌వార్ గంగారెడ్డి, గడ్డం జగదీష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజన్న, సాత్నాల ప్రాజెక్ట్ మాజీ చైర్మెన్ అల్లూరి అశోక్‌రెడ్డి, సోషల్ మీడియా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పుండ్రు రవి కిరణ్‌రెడ్డి, బద్దం సురేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన సీపీఐ(ఎం) నాయకులు



**నవతెలంగాణ-ఖానాపూర్**

పోలీసుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలు అలేఖ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు రాజీ కుదుర్చడం కాకుండా అప్పుడే ఆ యువకుడుపై చర్యలు తీసుకొని, ఉంటే బాగుండేదని అన్నారు. నిందితుడిపై ఫిర్యాదు అనంతరం పోలీసు వర్గాలు అతనిపై నిఘా పెట్టకపోవడమే ఈ హత్యకు కారణమైందని అన్నారు. అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై ఇంత దారుణంగా హత్య చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా స్పందించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా బాధిత కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, మండల నాయకులు సుంచుల నారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి మీనుగు కమల, అలేఖ్య కుటుంబ సభ్యులు, తర్లపాడు మాజీ సర్పంచ్ కట్ట శ్రీనివాస్, రాజు ఉన్నారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ



**నవతెలంగాణ-బేల**

మండలంలోని సదల్‌పూర్, చప్రాల గ్రామంలో జాతీయ ఉపాధి హామీ కింద రూ.19లక్షల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. ముందుగా శ్రీ భైరందేవ్, మహదేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చప్రాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బేల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావార్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఖోడద్ ప్రభుత్వ పాఠశాల సముదాయ స్థాయి మేళా



మేళాలో పాల్గొన్న జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, సర్పంచ్ ఆనంద్

**నవతెలంగాణ-తలమడుగు**

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఖోడద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాలల సముదాయాల స్థాయి మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఖోడద్, కజ్జర్ల, ఉండం, సుంకిడి, లింగి, కుచులాపూర్, పల్సి(కే) గ్రామాలకు చెందిన విద్యార్థులు క్విజ్ పోటీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు క్విజ్, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. బహుమతుల కోసం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్, ఎస్ఓలు సుజాత్ ఖాన్, నారాయణ, నోడల్ ఆఫీసర్ వెంకట్‌రావు, ఎంఈఓ నారాయణ, ఖోడద్ గ్రామ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ కుమారి, భరంపూర్ ప్రత్యూష, ఖోడద్ మాజీ సర్పంచ్ సాకి ఆనంద్, సుంకిడి ఎంపీటీసీ వెంకన్న, కోఆప్షన్ సభ్యులు బాబుఖాన్, దేవిదాస్, పురుషోత్తం, పోశెట్టి, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విటమిన్(ఎ) ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన డా.సర్ఫరాజ్



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్**

అనుకుంట నాలుగో వార్డు బంగారిగూడ విటమిన్(ఎ) ప్రోగ్రామ్ ను డా.సర్ఫరాజ్ మంగళవారం బంగారిగూడ అంగన్‌వాడీ సెంటర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. 9 నెలల నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు అంధత్వ నివారణ కొరకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ బొమ్మెత సుభాష్, కృష్ణవేణి, యశోధ, ఆరోగ్యకార్యకర్త శ్రీదేవి, ఆశ పుష్ప, వెంకటమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

## అవకాశం ఇస్తే ప్రజాసేవ చేస్తా



**నవతెలంగాణ-బోథ్**

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసే ఆలోచన ఉందని తనకు అవకాశం కల్పిస్తే ప్రజాసేవ చేస్తానని రాథోడ్ ప్రకాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ వస్తే పోటీ చేసి, గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. తనకు పేదల కష్టాలు తెలుసునని వారి అభివృద్ధి కోసం తాను రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి పెరిగిందన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంకా వెనుకబడి ఉందని సామాజిక స్పృహ ఉన్న తనకు పార్లమెంటు సభ్యుడిగా అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను బలపర్చాలని ఇప్పటికే జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మేధావులు, విద్యార్థులు యువతను కలిసి మద్దతు కోరానని అన్నారు. అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహేందర్ నాయకులు షేక్, రాజు, నాగేందర్, అబుద్ పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెక్కు అందజేత



**నవతెలంగాణ-ఇచ్చోడ**

చిరుతపులి దాడిలో మండలం ఎద్దు, దూడ మృతి చెందగా, అటవీ శాఖ ఆధ్వర్యంలో మంజూరైనా రూ.35వేల చెక్కులను సంబంధించిన యజమానులకు మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ పుండలిక్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ శిలానంద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ పుండలిక్ మాట్లాడుతూ గుడిహత్నూర్ మండలంలోని ధామన్‌గూడకు చెందిన రైతు ఎం.కృష్ణకు సంబంధించిన ఎద్దు చిరుతపులి దాడిలో మృతి చెంది నందుకు రూ.23వేల నష్టపరిహారం, ముత్నూర్‌కు గ్రామానికి చెందిన రైతు కేశవ్, దూడ చిరుతపులి దాడిలో మరణించినందుకు రూ.12వేల నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వన్య ప్రాణులన్నింటి కాపాడాలని, ఏమైనా పశువులు వన్యమృగం దాడిలో మరణించి వుంటే వెంటనే ఫారెస్ట్ అధికారులకు తెలపాలని అన్నారు. వారికి ప్రభుత్వం తరుపున నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా వన్యమృగం వేట కోసం విద్యుత్ తీగలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రధాని నాయకత్వంలోనే గ్రామాలు అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-జైనథ్**

గత ప్రభుత్వంలో సమస్యలతో కొట్టుమిట్టాడిన గ్రామాలు నేడు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న నిర్మాణానికి ఆయన స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అభివృద్ధికి నరేంద్ర మోడీ నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. కీలకపాత్ర పోషిస్తున్న నరేంద్ర మోడీ ఎన్నో విధాలుగా నిధులు కేటాయిస్తూ, గ్రామ స్వరాజ్యం తీసుకువస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లోనూ గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూరాలంటే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ అభ్యర్థిగా బీజేపీ బలపరుస్తున్న అభ్యర్థిని గెలిపించడమే కాకుండా రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి నాయకత్వంలో రాష్ట్రంలోని 12 పార్లమెంటు స్థానాల్లో గెలుపొంది. నరేంద్ర మోడీకి తెలంగాణ రాష్ట్రం నుంచి అఖండ మెజార్టీ ఇవ్వాలని కోరారు. అప్పుడే దేశ ప్రజలు సుభిక్షంగా సురక్షితంగా ఉంటారని అన్నారు. అంతేకాకుండా కోట్ల రూపాయల నిధులు గ్రామాలు అభివృద్ధికి మంజూరు చేసుకుని అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇవే కాకుండా జిల్లాకు సుమారు రూ.17కోట్లతో సీసీ రోడ్లతో పాటు డ్రైన్ నిర్మాణానికి మంజూరు చేశారని గుర్తు చేశారు. వీటితో పాటు యూనివర్సిటీ పసుపు బోర్డు మంజూరు చేసిన ఘనత నరేంద్ర మోడీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రావుత్ పొచ్చిరాం, గేడం తరుణ్, గౌకర్ వినోద్, గంగారెడ్డిలు పాల్గొన్నారు.

## పలువురికి ఆర్థిక సాయం అందజేత

**నవతెలంగాణ-నార్నూర్**

మండల కేంద్రంలో మంగళవారం పలువురు నిరుపేదలకు స్థానిక మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబం మహబూబ్ మేస్త్రి కుమార్తె పెండ్లికి రూ.5వేలు, నీరుపేద కూలి నిర్మలాబాయి కుమారుడు వివాహానికి రూ.5వేలు, అలాగే నిరుపేద కుటుంబానికి చెందిన మోయిజ్‌ఖాన్ కుమార్తె వివాహ పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.5వేలను ఆర్థిక సాయంగా అందించారు. గ్రామపంచాయతీలో ప్రజల సేవే లక్ష్యంగా ఇలాంటి నిరుపేద కుటుంబానికి చాలా మందికి తన వంతు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఫ్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, మాజీ ఉపసర్పంచ్ దాదే అలీ, నాయకులు బాబాఖాన్, ఫేరోజ్ ఖాన్, డి.గాంబర్, గోవింద్, మహేందర్, జాకురుల్లా, సతార్, అహ్మద్ ఖురేషి ఉన్నారు.

## నేడు పాఠశాలలో అక్షరాభ్యాసం

**నవతెలంగాణ-నార్నూర్**

మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్, తాడిహత్నూర్ గ్రామంలోని సేవాదాస్ స్కూల్‌లో బుధవారం వసంత పంచమినీ పురస్కరించుకొని పాఠశాలలో పండితులచే విద్యార్థులకు అక్షర అభ్యాసం నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గే మిలింద్, కరెస్పాండెంట్ జాదవ్ ఉమాజి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కుష్టు వ్యాధిపై గ్రామాల్లో అవగాహన

**నవతెలంగాణ-నార్నూర్**

మండలంలోని చోర్గావ్, బాబేఝరి గ్రామ పంచాయతీలో మంగళవారం వైద్యసిబ్బంది కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేసి కుష్టు నివారణకు కృషి చేయాలని కోరారు. గత నెల 30 నుంచి 13వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో 1386 మందికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించినట్టు పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తారాసింగ్, హెల్త్ సూపర్ వైజర్ చౌహన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది విద్యారాణి, అంగన్‌వాడీ టీచర్ సంగీత, ఆశాలు పారుబాయి, కల్పనా, రమాదేవి ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | ఫిబ్రవరి 14, 2024 | www.navatelangana.com



## జీపీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎల్‌పీఓ

నవతెలంగాణ-బెజ్జూరు



మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కాగజ్‌నగర్ డీఎల్‌పీఓ సురేష్‌బాబు మంగళవారం ఆకాస్మికంగా తనిఖీ చేశారు. గతంలో చేపట్టిన రోడ్డు పనుల డబుల్ బిల్లులు చెల్లించడం, అదనంగా చెల్లించిన పేమెంట్ రూ.321000 వెంటనే చెల్లించాలని అధికారులకు ఆదేశించారు. డబుల్ పేమెంట్ ప్రభుత్వానికి చెల్లించని యెడల సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీఓ రమేష్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తుకారాం ఉన్నారు.

## జడ్పీ సీఈఓకు వీడ్కోలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బదిలీపై వెళ్తున్న జడ్పీ సీఈఓ రత్నమాలను జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణతో పాటు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగస్తులకు బదిలీలు సహజమని, జిల్లాలో ఆమె పనిచేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగస్తులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించినప్పుడు ప్రజలలో మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు, జడ్పీ కార్యాలయ సిబ్బంది తోటజీ, బూరుగుడ మాజీ సర్పంచ్ గాజుల సత్యనారాయణ, గుండి మాజీ వార్డు మెంబర్ మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కౌటాల

జాన్వీ విజన్ కేర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం మండలకేంద్రంలోని జాన్వీ విజన్ కేర్ ఆస్పత్రిలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నారాయణ్ సర్కార్ తెలిపారు. మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు 50 మందికి నిర్వహించగా అందులో నుండి 26 మందికి ఆపరేషన్‌లు అవసరముండగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పవన్ కంటి ఆస్పత్రికి పంపించడం జరిగిందని తెలిపారు. 26 మందికి జేఆర్ సర్కార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయించనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు సీమా సర్కార్ పాల్గొన్నారు.

## పాఠశాలల సముదాయ సమావేశం

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆశ్రమ పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించినట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాందేవ్ తెలిపారు. ఈ సమావేశానికి మూడు కాంప్లెక్సులు మొగడ్‌దగడ్, సలుగుపెల్లి, సోమిని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించేల చూడాలన్నారు. పాఠశాలలో వివిధ రికార్డుల నిర్వహణ, మధ్యాహ్నభోజన వివరాలు, పాఠశాల నిర్వహణ నిధుల వినియోగం గురించి, ఇతర అంశాలపై చర్చించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి సముదాయ సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. సమావేశంలో ఏసీఎంఓ ఉద్ధవ్, డీఆర్‌పీ వామన్‌రావు, ఏటీడీఓ కమర్‌హుస్సేన్, జీపీడీఓ శకుంతల, వెంకటేశ్వర్, భుజంగ్‌రావు, ఎస్‌సీఆర్‌పీ భిక్షమయ్య పాల్గొన్నారు.

## మట్కా ఆడుతున్న ఒకరి అరెస్ట్



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని చింతగూడ గ్రామంలో మంగళవారం మట్కా ఆడుతున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో చింతగూడలో తనిఖీలు చేపట్టగా అబ్దుల్ మెహమూద్ వద్ద మట్కాకు సంబంధించిన చిట్టీలు లభించాయి. అతని వద్ద రూ.4,320 నగదు స్వాధీనం చేసుకుని కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రాణాప్రతాప్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా మట్కా, ఆన్‌లైన్ పోస్టింగ్, జూదం, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పీసీలు వేముర్ల మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

## ముంజంపెల్లిలో నీటి ఎద్దడి

నవతెలంగాణ - బెజ్జూరు

మండలంలోని ముంజంపెల్లి గ్రామంలో నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. మిషన్ భగీరథ పైపులైన్‌లు లీకేజీ కావడంతో గ్రామంలోకి మిషన్ భగీరథ నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్ లీకేజీలకు మరమ్మత్తులు చేయడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీంతో ఎండాకాలం ముందే నీటి ఎద్దడి సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. పైపులైన్‌లను వెంటనే మరమ్మత్తులు చేసి గ్రామానికి మిషన్ భగీరథ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మొక్కజొన్న సాగులో జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రైతులు మొక్కజొన్న, జొన్న పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గిర్నూర్, భూతాయి తదితర గ్రామాల్లోని వివిధ రకాల పంటలను పరిశీలించారు. ఇందులో భాగంగా మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు సూచనలు చేవారు. అనంతరం మండలంలోని ఫర్టిలైజర్‌లను తనిఖీ చేసి విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలు ఎరువులు మందులను రైతులకు అందించాలని ఫర్టిలైజర్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీదర్ స్వామి, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 15న సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కౌటాల

ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు నివేధికలను తయారుచేసి ఒక రోజు ముందుగానే ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఆయన తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

# సమస్యల పరిష్కారానికి పోరాటం

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం గార్డెన్‌లో జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్ల ప్రత్యేక రాష్ట్రంలో పోరాటాలు కరువయ్యాయని అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై తాము నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. 10 ఏళ్లలో విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. జడిపీలో విద్య రంగానికి కొఠారి కమిషన్ నిర్దేశించిన మేరకు నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఆ పని చేయలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాజా బడ్జెట్‌లో తక్కువగా నిధులు కేటాయించినప్పటికీ గత ప్రభుత్వంతో పోల్చితే రూ.1000 కోట్లు అధికంగా కేటాయించడం కొంత సంతోషించదగ్గ విషయమే అన్నారు. ఓకే క్యాడర్‌లో 12 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులు పని చేస్తున్నారని పదోన్నతులు, బదిలీలు లేక ఉద్యోగంపై విసిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో పదోన్నతులు కల్పించినప్పటికీ అరకొరగా మాత్రమే చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఇప్పటికే బదిలీలు, పదోన్నతులు, పీఆర్సీ అవసరాన్ని వివరించినట్లు వెల్లడించారు. ఎంపీ ఎన్నికలకు ముందుగా డీఏలు మంజూరు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, గిరిజన పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిపి పదోన్నతులు ఇవ్వాలన్నారు. 317 జీఓ రద్దు కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. సూపర్ న్యూమరి పోస్టులను సృష్టించి సొంత జిల్లాలకు ఉపాధ్యాయులను పంపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంగ్లీష్ మాధ్యమం ఎంతో అవసరం ఉందని దీనికి గాను పదివేల ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ప్రారంభించి ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలన్నారు. కస్తూర్బాలో కాంట్రాక్టు వ్యవస్థ రద్దు కోసం, వివిధ రకాల సొసైటీల పరిధిలో ఉన్న పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ అన్ని రకాల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. 317 జీఓ ద్వారా నష్టపోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకుడు సాయి కృష్ణ మాట్లాడుతూ మతోన్మాదం పేరుతో దేశంలో పరిపాలిస్తున్న బీజేపీ విద్యా వ్యవస్థను కార్పొరేటీకరణ చేసే దిశగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. పూర్తి కరోనా సమయంలో నూతన విద్యా విధానాన్ని 2020లో పార్లమెంటులో ఆమోదింప చేయడం పేదలకు విద్యను దూరం చేయడమే అన్నారు. నూతన విద్యా విధానం అమల్లోకి వస్తే అంగన్‌వాడీ వ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. బీజేపీ విధానాలను వ్యతిరేకించి విద్యావ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు, జిల్లా నాయకులు దూలం ఎల్లయ్య, హేమంత్ షిండే, కాంపల్లి ఉషన్న, రమేష్, దుర్గయ్య, నిరంజన్, నారాయణ, తులసిరామ్, శ్రీనివాస్ మహిపాల్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మిడి భీమేష్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జంగయ్య



పాల్గొన్న ఉపాధ్యాయులు

# ఆర్టీసీ కార్మికులకు ట్రెజరీ ద్వారా వేతనాలివ్వాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ట్రెజరీల ద్వారా ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాపిత సమ్మెకు సంబంధించి వాల్ పోస్టర్లను కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ప్రభుత్వ ట్రెజరీల ద్వారా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులు ప్రయివేటు ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల హామీల్లో ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీ విలీనం ప్రక్రియను వెంటనే చేయాలని, అలాగే ఆర్టీసీ కార్మికులకు పెండింగ్లో ఉన్న 2 వేతన సవరణలు, 9 డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ హైర్ బస్ డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. ఆర్టీసీకి రాష్ట్ర బడ్జెట్‌లో మూడు శాతం నిధులు కేటాయించాలని 2019 సమ్మె కాలంలో ఉద్యోగులపై ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల సెటిల్మెంటును విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ టి.దివాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత్‌రావు, ప్రయివేట్ హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి షఫీక్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, నాయకులు నగేష్, విజయ్, రఘులయ్య, తేజ, విజయ్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు, కార్మికులు

# పూలాజీబాబా జీవితం ఆదర్శప్రాయం

- మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నవతెలంగాణ-జైనూర్

సంత్ పూలాజీబాబా జీవితం నేటి సమాజానికి ఆదర్శ ప్రాయమని ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం సిర్పూర్(యు) మండలంలోని పంగ్డీ గ్రామంలో ఆయన పర్యటించి పూలాజీబాబా ధ్యానమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలాజీబాబా చేసిన సేవలు నేటి సమాజం మరువలేనిదన్నారు. ఆయన జీవితంలో ఎన్నో మంచి మార్గాలను చూపించారని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక ధ్యాన మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తన జీవితంలో ఎంతోమంది యువతను ప్రోత్సహించారని తెలిపారు. అనంతరం పూలాజీబాబా తనయుడు కేశవరావుతో కలిసి పూలాజీబాబా 22వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సిర్పూర్(యు) మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆత్రం ప్రకాష్, జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భగవంత్‌రావు, గౌరీ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ జాలింషావ్, ఆంద్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు శ్యాంరావు, తులసీరాం పాల్గొన్నారు.



# అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంటు స్థానం నుంచి తనకు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం ఇస్తే జిల్లాను అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ ఆశావాహురాలు ఉట్నూర్ మాజీ జడ్పీటీసీ సుగుణక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ నివాసంలో ఆయనతో కలిసి పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో 1996లో ఉట్నూర్ జడ్పీటీసీగా కాంగ్రెస్ తనకు అవకాశం ఇచ్చిందన్నారు. అప్పుడు భారీ మెజార్టీతో గెలిచానని అన్నారు. తర్వాత ఉపాధ్యాయురాలుగా కెరమెరిలో పనిచేశానని జిల్లాతో తనకు ఎంతగానో అనుబంధం ఉందన్నారు. పార్టీ అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని తెలిపారు. గిరిజన బిడ్డలకు కాంగ్రెస్ ఎప్పుడు అండగా ఉంటుందని అదే పంథాను ప్రస్తుతం కొనసాగించాలని కోరారు. కాంగ్రెస్‌తో 18 సంవత్సరాల అనుభవం ఉందన్నారు. రానున్న రోజుల్లో మరింత సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మాట్లాడుతూ సుగుణక్కతో తనకు ఎప్పటి నుండో అనుబంధం ఉందన్నారు. సౌమ్యురాలు ప్రజల్లో మంచి పేరు ఉందని కితాబునిచ్చారు. అధిష్టానం ఆదేశాల మేరకు తాము నడుచుకుంటామని ఎంపీ టికెట్ ఎవరికి వస్తే వారికి మద్దతు ఇస్తామని తెలిపారు. టికెట్ తెచ్చుకోవాల్సిన బాధ్యత అభ్యర్థులదైతే గెలిపించాల్సిన బాధ్యత తమదన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మసాడి చరణ్, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గం అధ్యక్షుడు ఎండీ జమీర్, జిల్లా నాయకులు ఇరుకుల్ల మంగ పాల్గొన్నారు.

## సఖీ సేవలపై అవగాహన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ, అగర్‌గూడ, కమ్మర్‌గాం, నందిగామ, జిల్లెడ, గుండెపెల్లి గ్రామాల్లో మంగళవారం సఖీ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి సఖీ కేంద్రం నిర్వాహకురాలు శ్రీనిధి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలతో ఆమె సఖీ ద్వారా అందించే ఐదు రకాల సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖీ సిబ్బంది హారిక, రఘు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడు కొట్నక విజయ్ కుమార్ అన్నారు. గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎన్నికైన క్రీడాకారులకు డీటీడీఓ రమాదేవితో కలిసి జిల్లా కేంద్రంలో ట్రాక్ సూట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి సట్ల శంకర్, కోశాధికారి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు కష్ణమూర్తి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను వాడకూడదు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేదించాలని ఎంపీఓ గంగాసింగ్ దుకాణ యజమానులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ప్లాస్టిక్‌కు బదులుగా కాగితం, జ్యూట్ బ్యాగులను ఉపయోగించుకోవాలని దుకాణదారులకు సూచించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవు

నవతెలంగాణ-వాంకిడి

వ్యవసాయ పొలాల్లో పంటల రక్షణ కోసం, అటవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సాగర్ హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలానికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ప్రవీన్ మృతిపై పోలీస్ కార్యాలయంలో మంగళవారం సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ప్రవీన్ కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా సాటారంలో విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ తీగలు తగిలి మృతిచెందడం కలిచివేసిందన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ఎవరైన విద్యుత్ తీగలు అమర్చితే అలాంటి వారి సమాచారం పోలీసులకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. మండలంలోని తొక్కిగూడలో విద్యుత్ తీగలు అమర్చిన ఘటనలో తీగలు తగిలి ఒకరు బలయ్యారని, ఇలాంటి విద్యుత్ తీగలు అమర్చితే కఠిన శిక్షలు తప్పవన్నారు. పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చడంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికైనా వ్యవసాయ కూలీలు కానీ, రైతులు కానీ విద్యుత్ తీగలు అమర్చవద్దని ఆయన మండల ప్రజలను కోరారు.

## సైకిల్‌పై అయోధ్యకు చేరిన పీవీటీజీ యువకుడు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని తిర్యాని మండలం ఏదులపాడు గ్రామానికి చెందిన పీవీటీజీ యువకుడు ఆత్రం ప్రభాకర్ కుమారుడు సచిన్ గత నెల 22న అయోధ్యకు సైకిల్‌పై బయలుదేరగా మంగళవారం చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య ఆలయ ప్రారంభం తర్వాత సైకిల్ యాత్ర చేయాలని నిర్ణయం తీసుకున్నానని, దీనిలో భాగంగానే అయోధ్యకు బయలుదేరి వచ్చినట్లు తెలిపారు. యాత్రకు అనేకమంది సహకారం అందించారని, దారి పొడుగునా ఆదరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సచిన్ క్షేమంగా అయోధ్యకు చేరడంతో గ్రామంలో సందడి నెలకొంది.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | ఫిబ్రవరి 14, 2024 | www.navatelangana.com



## శిక్షణ కేంద్రం ఏర్పాటుకు జీఎం సమీక్ష

నవతెలంగాణ-మందమర్రి

స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు మంగళవారం ఏరియా జీఎం మనోహర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డిపార్ట్మెంట్ల అధికారులతో సమీక్షించారు. ఏరియాలో డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, ఎస్ఎస్సి అర్హత పొందిన నిరుద్యోగ యువత కోసం 8 స్కిల్ డెవలప్మెంట్ కోర్సులను నిర్వహించాలని ప్రతిపాదించారు. సాంకేతిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌సీసీఎల్ మైన్స్.కామ్/అప్రెంటిషిప్ వెబ్సైట్ ఈ నెల 13 సాయంత్రం నుండి అందుబాటులో ఉంటుందని తెలిపారు. సర్టిఫికెట్లతోపాటు దరఖాస్తు హార్డ్ కాపీలు ఏరియాలోని ఎంవీటీసీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. శిక్షణ తరగతులను త్వరగా ప్రారంభించడానికి అధికారులకు సూచనలు సలహాలను చేవారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

## రేషన్‌షాప్ తూకంలో తక్కువ బియ్యం

నవతెలంగాణ-హాజీపూర్




రేషన్ షాప్‌లో తక్కువ జోకుడు దోపిడీ బయటపడిన ఘటన మండలంలోని ముల్కళ్ళ గ్రామంలో చోటు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డ్ ఉన్న వారికి ఎక్కడైన సరకులు తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఇదే అదునుగా భావించిన హాజీపూర్ మండలంలోని ముల్కల్ల గ్రామంలోని 13వ నెంబర్ రేషన్ షాప్ స్థానిక ఇటుక బట్టీల్లో పని చేసే ఇతర ప్రాంతాల కూలీలు ఇక్కడే రేషన్ తీసుకుంటారు. వారికి ఇచ్చే రేషన్ బియ్యం తూకంలో తక్కువ జోకుతున్నరని మంగళవారం అనుమానం వ్యక్తం చేస్తూ కిరాణ షాప్‌లో బియ్యాన్ని తూకం వేయగా ఒక్కక్కరికి రెండు కిలోల తక్కువ తూకం వచ్చినట్లు గుర్తించి ఆందోళన చేశారు. గతంలో ఈ షాపు యజమాని అసాధి సుధాకర్‌పై అక్రమ రేషన్ బియ్యంపై 6ఏ కేసులు కూడా నమోదయ్యాయి. ఈ రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని జన్నారం అటవీరేంజ్ పుట్టిగుడా బీట్లో మంచిర్యాల నుంచి అదిలాబాద్ వెళ్లే ప్రధాన రహదారి హనుమాన్ టెంపుల్ సమీపాన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో చుక్కల దుప్పికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో, వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని చుక్కల దుప్పిని మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలకు తీసుకువచ్చారు. డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స చేయించారు. అయినా ఆ చుక్కల దుప్పికి మెడ దగ్గర తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందింది. అనంతరం ఆ చుక్కల దుప్పిని డీర్ పార్క్ సమీపంలో పూడ్చిపెట్టినట్లు అటవీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు రహీముద్దీన్, శ్రీనివాస్, జాడి బాణయ్య పాల్గొన్నారు.

## 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్



నవతెలంగాణ-కాసిపేట

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు, బొగ్గు గనుల వేలం, 44 కార్మిక చట్టాల మార్పుకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం పిలుపునిచ్చారు. మంగళవారం కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంబంధిత సమ్మె పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రయివేటు వారికి దారాదత్తం చేస్తూ కార్మికులకు, ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. ఉద్యోగ భద్రత లేక కార్మికులు, అధిక ధరలతో ప్రజలు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశ వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమ్మెను కార్మికులు, కర్షకులు ప్రజలు అందరూ అన్ని యూనియన్లు కలిసి పెద్ద మొత్తంలో ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాసిపేట గని పిట్ సెక్రటరీ మినుగు లక్ష్మీనారాయణ ,అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ రాజేందర్, రంజిత్, రాజు, ఇరుగురాల సంపత్, ఆడెపు రవీందర్, బియ్యాల రాజన్న, సురేష్, అంజి, వెంకటేష్ పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకం ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



నవతెలంగాణ-మందమర్రి

గృహ జ్యోతి పథకం ఆన్‌లైన్ ప్రక్రియను మందమర్రి విద్యుత్ అధికారులు ప్రారంభించారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలనలో భాగంగా తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుట కొరకు గృహ జ్యోతి పథకం ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియను విద్యుత్ అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ కొమురయ్య, కాంగ్రెస్ మండల ఇన్‌ఛార్జి కదారి జీవన్ కుమార్, ఏఎల్ఎం సంజీవ్, జెఎల్ఎం యాదయ్య, కరోబార్ మధుకర్, ఎలక్ట్రీషన్ సుమన్ పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలపై గని మేనేజర్‌కు వినతి



నవతెలంగాణ-మందమర్రి

కేకే ఓసీ కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ, ఎస్సీడబ్ల్యుయు నాయకులు గని మేనేజర్‌కు మంగళవారం వినతి ప్రతం అందజేశారు. మందమర్రి కేకే ఓసీ పిట్ సెక్రటరీ మర్రి కుమారస్వామి మాట్లాడుతూ ఓసీలో పని చేస్తున్న కార్మికులకు హెచ్ఆర్ఏ 9 శాతం రావటం లేదని, గని మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికీ కార్మికులకు బేసిక్‌పై 9 శాతం చెల్లించటానికి యాజమాన్యం జాప్యం చేస్తుందని, అర్హులైన వారికి వెంటనే 9 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే 4 సీమ్, 3 సీమ్, కోల్ సీమ్‌లు మన శావల్స్ తోనే ఉత్పత్తి తీయాలని, ఇన్కమ్ టాక్స్ రీయంబర్స్మెంట్, పర్క్స్ మీద అలవెన్స్‌లను అధికారులకు ఇస్తున్న విధంగానే కార్మికులకు కూడా చెల్లించాలని తెలిపారు.

## జెఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన బెల్లంపల్లి సీఓఈ



నవతెలంగాణ-తాండూర్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ) మంగళవారం విడుదలచేసిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ(సీఓఈ) బెల్లంపల్లి విద్యార్థులు సత్తా చాటారు. 8 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ పర్సెంటెయిల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. వీరిలో దుర్గం చరణ్ తేజ్ 85.04 పర్సెంటైల్ తో కళాశాల టాపర్‌గా నిలిచారని తెలిపారు తరువాతి స్థానాల్లో వరుసగా తీగల ఆశ్రిత్(83.64), దుర్గం అభినందన్(75.50), లింగంపల్లి అంజి(63.39), ఆకుతోట శివసాయి(58.17), కామెర విష్ణుచైతన్య-(55.16),పుట్టల శివ-(54.92),కొందుకూరి దిలీప్(50.11) విద్యార్థులు తరువాతి స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీఓఈ సూపరింటిండెంట్ అవదూత రాజశేఖర్ వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, అధ్యాపకులు నాగినేని శ్రీరామవర్మ, మిట్టా రమేష్, చందా లక్ష్మీనారాయణ, కట్ల రవీందర్, ముద్దసాని శోభ సిబ్బంది సమేందర్, తేజశ్వి, రాజశేఖర్, ఐ.మల్లేశ్ పాల్గొన్నారు.

## మేడిగడ్డకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు మేడిగడ్డ బ్యారేజ్ వెళ్తున్న సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో పరిశీలించడానికి వెళ్లారు. మంగళవారం లక్షెట్టిపేట మండల అధ్యక్షుడు పింగిళి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డకు బయలుదేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో గత ప్రభుత్వం రూ.వేలకోట్లు దుబారాగా ఖర్చు చేసిందని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, అన్నం చిన్నన్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ మహాసభలు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మార్చి 3,4,5న ఖమ్మంలో నిర్వహించే సీపీఐ ఎంఎల్(మాస్ లైన్) ఆల్ ఇండియా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని, సీపీఐ ఎంఎల్ ప్రజాపంతా మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు పురంశెట్టి బాపు అన్నారు. మంగళవారం మండలంలోని చింతగూడ గ్రామంలో జాతీయ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో 14 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న పీసీసీ సీపీఐ ఎంఎల్ ప్రజా పంతా సిపిఐ ఎంఎల్ రివాల్యుషనరీ ఇన్సియేటివ్, మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీల విలీనమైన సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీగా ఏర్పడుతున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఈ మహాసభలో ఎండగడతామన్నారు. ఈ జాతీయ మహాసభలను పార్టీ నాయకులు కార్మిక కర్షకులు విజయవంతం చేయాలని కోరరు.

## వైద్యున్ని నియమించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం

- గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కనక యాదవరావు



నవతెలంగాణ-జైనూర్

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యాధికారిని నియమించకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు కేంద్ర బిందువుగా మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి అని అన్నారు. ఈ ప్రభుత్వ ఆస్పత్రిలో రోజూవారీగా సుమారు 300లకు పైగా ఓపీ రోగులు వస్తారన్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కేవలం ఒకే వైద్యుడితో గత కొన్ని నెలల నుండి వైద్యమందిస్తున్నారన్నారు. ఆస్పత్రిలో డాక్టర్‌లు లేకపోవడంతో ఏజెన్సీ ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందడంలేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే కనీసం డాక్టర్లు కూడా ఉండడంలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు లేక వైద్యం అందని ద్రాక్షగా మారిందని వాపోయారు. ఆస్పత్రికి వెళ్తే నర్సులతో వైద్యం అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వైద్యాధికారి తుకారాం జిల్లా వైద్య కార్యాలయానికే పరిమితమయ్యారని వాపోయారు. జిల్లా కేంద్రంలో పర్యవేక్షిస్తూ క్షేత స్థాయిలో వైద్యాధికారుల పనితీరుపై చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. జిల్లావ్యాప్తంగా పర్యటించి వైద్యం ప్రజలకు అందిస్తున్నారా లేదా అని పర్యవేక్షణ చేయకుండా ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని డీఎంఅండ్‌హెచ్ఓ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉషెగావ్ ఎంపీటీసీ కుమ్ర భగవంత్‌రావు, మాజీ సర్పంచ్ ఉయిక రమాకాంత్, ఆదివాసీ సంఘాల నాయకులు పెందూర్ అర్జున్ పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తాం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వచ్చే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని గ్రామ ప్రత్యేక అధికారి మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత, కార్యదర్శి, లావణ్య అన్నారు. మంగళవారం తిమ్మాపూర్ గ్రామంలో ఎస్సీ కాలనీలో చెడిపోయిన పైపులైన్లను బాగు చేయించారు. మంచినీటి ట్యాంకు ద్వారా ఇంటింటికీ నీటిని అందిస్తామన్నారు. మురుగునీటి కాలువలు రోడ్లు, పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

## ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కాడే హేమంత్

వచ్చే పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని సక్రమంగా పాటిస్తూ సహకరించాలని అన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 4 లక్షల 55 వేల 437 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 2 లక్షల 26 వేల 991 మంది పురుషులు, 2 లక్షల 28 వేల 416 మంది స్త్రీలు, 30 మంది ట్రాన్స్ జెండర్‌లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ పరిశీలన కార్యక్రమం ఈ నెల 14వ తేదీన ఈవీఎం గోదాములో ముగింపులో భాగంగా మాక్ పోలింగ్ కార్యక్రమం ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ నెల 14వ తేదీన ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని, ఏవైనా అనుమానాలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సహాయక పోలింగ్ కేంద్రాలతో పాటు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఎంజేపీ విద్యార్థికి పతకం



నవతెలంగాణ-హాజీపూర్

ఫిబ్రవరి 2 నుంచి పదవ తేదీ వరకు బెంగళూరులో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సౌత్ జోన్ నేషనల్ ఓపెన్ టాలెంట్ హంట్ పోటీలలో మండలంలోని గుడిపేట గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉగ్గే ఇంద్ర వర్మ ఉత్తమ ప్రతిభ కనబరిచి 66-70 కిలోల జూనియర్ భాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా మంచిర్యాల అదనపు పాలనాధికారి మోతిలాల్ విద్యార్థికి మెడల్ ప్రధానం చేసి అభినందించాడు. రానున్న రోజుల్లో మరింత శిక్షణ పొంది పతకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా యువజన క్రీడల అధికారి బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, వయోజన విద్య జిల్లా అధికారి పురుషోత్తం నాయక్, ఎంజేపీ బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ షేరు శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయుడు, బాక్సింగ్ కోచ్ కొట్టే దేవేందర్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవు

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని వివిధ గ్రామాల సరిహద్దు ప్రాంతాలలో వన్య ప్రాణుల కోసం వేటగాళ్ళు పంటపొలాల్లో, లేదా అటవీప్రాంతాల్లో విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని, కెరమెరి ఎస్ఐ గుంపుల విజయ్ అన్నారు. దొంగతనంగా విద్యుత్ తీగలు అమర్చడం వలన అవి జంతువులు, మనుషులు ప్రమాదాలకు దారితీస్తున్నయని ఆయన అన్నారు. ఇటీవల మండల పరిదిలోని పాటగుడ గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు అటవి జంతువుల వేట గురించి కరెంట్ వైర్ పెట్టడంతో సిడం మారు, దనోర గ్రామానికి చెందిన సిడం బీము చనిపోయినట్లు తెలిపారు. వారి మరణానికి కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేశామని తెలిపారు, ఇలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వేట కోసం విద్యుత్ వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో కార్మెల్ విద్యార్థిని

నవతెలంగాణ-హాజీపూర్



గూడిపేట్ మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని దీక్షిత 600 మీటర్ల రన్నింగ్ పోటీల్లో అథ్లెటిక్ విభాగంలో గుజరాత్‌లో జరుగుతున్న జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటుంది. గత డిసెంబర్‌లో మంచిర్యాల డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 16 నుంచి గుజరాత్‌లో జరిగే నేషనల్ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటుంది. ఈ సందర్భంగా దీక్షితను పీఈటీ నరేందర్‌ను పాఠశాల ప్రిన్సిపల్ అల్ఫీ అభినందించారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 14, 2024 | www.navatelangana.com

## సంక్షేమశాఖ అధికారిణిని కలిసిన దివ్యాంగులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా సంక్షేమ శాఖ అధికారిణిగా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన సబితను దివ్యాంగులు కలిశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో నూతన అధికారిని కలిసి పూల బొకే అందించి, తమ సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బావుని నగేష్, కార్యదర్శి నన్నయ్య, నాయకులు సంతోష్, మోహన్, సయ్యద్ హంజా, రాకేష్, మహేందర్ పాల్గొన్నారు.

## ఇంగ్లీష్‌పై పట్టు సాధించేలా పోటీలు అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంగ్లీష్‌పై పట్టు సాధించేలా స్పెల్ విజార్డ్ అండ్ డ్రామా పోటీలు నిర్వహించడం అభినందనీయమని డీఈఓ ప్రణీత అన్నారు. మంగళవారం డైట్ కళాశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఈఓ ప్రణీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత నెల 29న విజార్డ్ అండ్ డ్రామా పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు మంగళవారం జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి డీఈఓ బహుమతులను అందించారు. తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లీష్‌లో రాణించేలా పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి పోటీల కారణంగా విద్యార్థుల్లో భాషపై పట్టు వస్తుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలకు తన వంతుగా సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనంత్ కుమార్, బాలాజీ, కోశాధికారి విశ్వాస్, సభ్యులు అన్వర్ అలీ, రమాకాంత్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


# ప్రేమలో గెలిచారు..జీవనం కొనసాగిస్తున్నారు..

- నేడే ప్రేమికుల దినోత్సవం
- ఆదర్శంగా ప్రేమపెండ్లి జంటలు



కులం, మతం, ప్రాంతం.. ఇలాంటి భేదాలు లేకుండా జరుపుకొనే వేడుక ఏదైనా ఉందంటే అది ఒక 'వాలెంటైన్స్ డే'నే అని చెప్పాలి. ప్రేమకు ఎలాంటి హద్దులు ఉండవు. ప్రేమ, ధనిక, పేద తేడాను చూడదు. అందుకే ఈ పదానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక ప్రేమలో ఉన్న వారికి ప్రతిరోజూ ఓ పండగే అయినా యేటా ఫిబ్రవరి 14న మాత్రం 'ప్రేమికుల దినోత్సవాన్ని' ప్రత్యేకంగా జరుపుకొంటారు. తమ మనసులోని ప్రేమను చాక్లెట్లు, బొమ్మలు, ఖరీదైన బహుమతులు.. చివరికి ఒక రోజా పువ్వుతోనైనా తెలియజేస్తుంటారు. ఫిబ్రవరి 7వ తేదీన వాలెంటైన్ మొదలు కొని రోస్ డే, ప్రపోస్ డే, చాకోలెట్ డే, టెడ్డి డే, ప్రామిస్ డే, ప్రపోజ్ డే, హగ్ డే, కిస్ డే ఇలా 7 రోజులు ఒక్కో విధంగా తమ ప్రేమను చాటుతారు. ఎన్నాండ్ల నుంచో మదిలో పదిలంగా దాచుకున్న మాటను వ్యక్తీకరించే సమయం ప్రేమికుల దినోత్సవం. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన 'వాలెంటైన్స్‌డే' ఇప్పుడు పల్లెలకు కూడా విస్తరించింది. అన్ని చోట్లా ఈ రోజు సందడే సందడి. కానుకలతో మదిలో మాటలు.. ఎన్నాండ్లుగా దాచుకున్న ఊసులను ఒకరితో పంచుకుంటూ ఒక్కటయ్యే ప్రేమజంటలు.. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఒకటిగా జీవించాలనే వారి తాపత్రయం. ప్రేమ అనేది గుండె గుండెకూ జలపాతంలా ప్రవహిస్తూనే ఉంది. అందుకే ఎన్నితరాలు, స్వరాలు మారినా ప్రేమ అమృతంలా మిగులుతోంది. కొన్ని ప్రేమ కథనాలతో నవతెలంగాణ ప్రత్యేకం..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



### ఒక్కటైన జంట.. ఒకటే ఉద్యోగం చేస్తూ

- గెడం సాయిప్రసాద్ - శ్రీధరదేవి (అసిస్టెంట్ ప్రొఫెసర్స్)



కళాశాలలో ఏర్పడిన ప్రేమ, పెండ్లి చేసుకొని ఇప్పుడు కళాశాలలోనే ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న జంట ఆదర్శమైంది. మాది ఆదిలాబాద్ జిల్లా డిగ్రీ కళాశాలలో మా మధ్య ప్రేమ ఏర్పడింది. ఇద్దరం కలిసి చదువుకొని ఇద్దరం 2011లో డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగాలు సాధించాం. 2014లో నిర్మల్‌లో వేద పండితుల సమక్షంలో వైభవంగా మా వివాహం జరిగింది. నేటికి 10 వసంతాలు పూర్తి చేసుకోగా కుమారుడు కృష్ణ, కూతురు అక్షయ ఉన్నారు. కులాలు వేరైనా మా ప్రేమను ఇరు కుటుంబాలను ఒప్పించి చేసుకోగా నేడు కలిసి మెలసి సంతోషంగా జీవిస్తున్నాం. ప్రస్తుతం ఆదిలాబాద్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఉట్నూర్ డిగ్రీ కళాశాలలో ఒకరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాము. ప్రస్తుత పరిస్థితుల్లో యువతకు ప్రేమ అనే పదానికి నిర్వచనమే తెలియదు. ప్రేమిస్తే.. పెద్దలను ఒప్పించి పెండ్లి చేసుకోవాలి. అంతేకాని అఘాయిత్యాలకు పాల్పడటం మంచిది కాదు. పెండ్లి చేసుకున్న తర్వాత ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకోవాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి.

### నా సతీమణి జీవితంలోకి రావడం అదృష్టం

గాజరి జగదీష్ - సుజాత (కలెక్టరేట్ లో ఉద్యోగి)



ఓ శాంతి భవనంలో పరిచయం ఏర్పడి, ఆ పరిచయం కాస్త ప్రేమగా మారి పెండ్లి వరకు తీసుకెళ్లింది. 2010లో ఇరు కుటుంబాల సాక్షిగా రామాలయంలో పెండ్లి చేసుకొని సుఖ సంతోషాలతో ఉన్నత ఉద్యోగం చేస్తూ, కలిసి మెలిసి జీవిస్తున్నాం. మాకు శ్రీవల్లి, శ్రీవైష్ణవి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నా భార్య నా జీవితంలోకి రావడం నాకు సపోర్ట్ చేయడంతో అనుకున్నవి సాధిస్తున్నాను. ప్రేమ అనేది కుటుంబ పెద్దలను బాధపెట్టకుండా ఉండాలి. వారిని ఒప్పించి పెండ్లిళ్లు చేసుకోవాలి. ఒకరినొకరు ప్రేమించి, నమ్మకముంచి పెండ్లి చేసుకున్నప్పుడు జీవిత భాగస్వామికి ఎటువంటి లోటు రాకుండా చూసుకోవాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. ఒకరి బాధలను మరొకరు పంచాలి. సంసారంలో మనస్పర్ధలను రానివ్వవద్దు. ఇద్దరు కలిసి నిర్ణయాలు తీసుకోవాలి.

### పెద్దలను ఒప్పించి.. సంతోషంగా ఉన్నాం..

-అల్వల రాకేష్ - ఆశ (అపోలో ఫార్మసీ ఉద్యోగి)

మాది జైనథ్ మండలం డిగ్రీ చదువుతున్నప్పుడు మా మధ్య ప్రేమ ఏర్పడింది. 2013 సంవత్సరంలో పెద్దలను ఒప్పించి కులాంతర వివాహం చేసుకోగా, నేటికి 11 వసంతాలు పూర్తి చేసుకున్నాం. మాకు 2 సంవత్సరాల బాబు అనూరుబ్ ఉన్నారు. ఇద్దరం కలిసి మెలిసి జీవిస్తున్నాం. ప్రేమించి పెండ్లి చేసుకున్నప్పుడు భార్యాభర్తలు జీవితాంతం కలిసి ఉండాలి. ఒకరినొకరు అర్థం చేసుకొని సంసారం చక్కదిద్దుకోవాలి. అంతేగాని మనస్పర్ధలకు తావివ్వవద్దు. అనవసరంగా జీవితం నాశనం చేసుకోవద్దు.



### కలిసిమెలిసి జీవిస్తూ.. రాజకీయంగా ఎదిగి

- అన్నెల వసంత్ - రాజలక్ష్మీ (రాజకీయ నాయకులు)



మాది ప్రేమ వివాహం, కులాంతర వివాహం చేసుకోని రాజకీయంగా ఎదిగి ఉన్నత స్థానంలో ఉన్నాము. ఆదిలాబాద్ పట్టణంలో ఒకే కాలనీ సుభాష్ నగర్‌లో ఉండగా పాఠశాలలో చదువుతున్న క్రమంలో ప్రేమ ఏర్పడింది. ఆ ప్రేమ 2011లో వివాహానికి నాంది పలికింది. 2013లో రిజర్వేషన్ కోట కింద వార్డు మెంబర్‌గా ఎన్నికల్లో నిలబడి విజయం సాధించాం. మాకు శాన్విక కూతురు ఉంది. నేటికి మా బంధం 13 వసంతాలు పూర్తి చేసుకోగా, సంతోషంగా ఉన్నతంగా జీవిస్తున్నాం. కేవలం ప్రేమిస్తేనే సరిపోదు. బాధ్యతలు గుర్తెరగాలి. వాటిని నిర్వర్తించే శక్తి సంపాదించాలి. తనను నమ్మి వచ్చిన భాగస్వామికి ఎప్పుడు అండగా ఉండాలి. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించాలి.

## పోతగూడ గ్రామస్తుల తాగునీటి తిప్పలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మండలం ఖండాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోతగూడ గ్రామస్తులు తాగు నీటికి కష్టాలు పడుతున్నారు. బిందెలు, బకెట్లు పట్టుకొని సుమారు కిలో మీటర్ వరకు నడిచి బావి నీరు తెచ్చుకుంటున్నారు. సోలార్‌తో నడుస్తున్న రెండు బోర్లు చెడిపోవడంతో నీటి కష్టాలు తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బావి నీరు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే ఎండాకాలం ఎలా ఉంటుందోనని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## నష్టపోయిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-భైంసా

అకాల వర్షంతో నష్టపోయిన పంటలను మంగళవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వడగండ్ల వాన తానూర్ మండలంలో తీరని నష్టాన్ని మిగిల్చింది. ఆదివారం కురిసిన వర్షానికి వందలాది ఎకరాల్లో నష్టం జరిగింది. మండలంలోని కోలూరు, మొగిలి, మసల్గా, ఎల్వి గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ పరిశీలించారు. జొన్న, మొక్క జొన్న పంట పూర్తిస్థాయిలో నెలకొరగడం, పొగాకు పంట వడగండ్ల వల్ల పూర్తిస్థాయిలో ఆకు రాలిపోవడం, శనగ, ధనియా, పుచ్చకాయ పంటలు దెబ్బ తినడంతో తాము ఎకరానికి రూ.30 వేల నుంచి లక్ష రూపాయల వరకు నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట ఒకే గంటలో కురిసిన వర్షంతో నష్టపోయామని కన్నీటి పర్యంతమయ్యారు. నష్టపోయిన ప్రాంతాలన్నీ తిరుగుతూ ఎమ్మెల్యే రామారావు పటేల్ రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ నిన్న అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలవడం జరిగిందన్నారు. ఆందోళన చెందవద్దని ప్రభుత్వం తరపున ఆదుకునేందుకు పాటుపడతానన్నారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ శాఖ ఏడీ. ఎ.వీణ, బీజేపీ నాయకులు శివాజీ పటేల్, చక్రధర్ పటేల్, చిన్నారెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

## కుష్టువ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యార్థులు కుష్టు వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని డీఎల్‌ఓ డాక్టర్ గజానన్ అన్నారు. మంగళవారం మండలంలోని బంగారిగూడ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంకోలి పీహెచ్‌సీ డా.సర్ఫరాజ్, మైనార్టీ ప్రిన్సిపాల్ తన్వీర్, డీపీఎం వామన్‌రావు, రమణచారి, హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, కొడప యశోద, సీహెచ్‌ఓ కృష్ణవేణి, ఆరోగ్యకార్యకర్త శ్రీదేవి, గుండం ఆశ, పుష్ప, వెంకటమ్మ విద్యార్థినులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు

నవతెలంగాణ-బోథ్

మార్కెట్ కమిటీ పాలకవర్గాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు అయినట్టు మార్కెట్ కమిటీ అధికారి తెలిపారు.

## నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 14న బుధవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శైలజ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## బోథ్ ఎంపీడీఓగా ఎల్.రమేష్

నవతెలంగాణ-బోథ్

మండల ఎంపీడీఓగా ఎల్.రమేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఎంపీడీఓగా ఉన్న సుశీల్‌రెడ్డి ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లగా నిర్మల్ జిల్లా మామడ మండలం ఎంపీడీఓగా విధులు నిర్వహించిన ఎల్.రమేష్ బోథ్ ఎంపీడీఓగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

**ఇంద్రవెల్లి :** మండల ఎంపీడీఓగా భాస్కర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన పుష్పలత నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు.

## పంట నష్టపరిహారం అందించాలి

నవతెలంగాణ-ముధోల్

అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించాలని బీజేపీ కిషన్ మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షులు ముత్యంరెడ్డి మంగళవారం తహసీల్దార్ అతికొద్దిన్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు రోజుల క్రితం అకాల వర్షంకారణంగా మండలంలో కురిసిన అకాల వర్షానికి పలు రైతుల పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు శ్రీనివాస్, భోజన్న ఉన్నారు.


## గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని పాత ఉట్నూర్, ఎత్మసూర్ నగర్ కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులకు భూమిపూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుందని చేసేది చెప్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని అన్నారు. ప్రజాప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. త్వరలో ఆరు గ్యారంటీలను అమలు చేసి, ప్రతి పేదవాడికి అదే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తా : ఎంపీ




నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ విద్యా అభివృద్ధి కోసం ఎంపీ నిధులను మంజూరు చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నూతన డిజిటల్ తరగతులను ఎంపీ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధి చెందితేనే దేశం, రాష్ట్రం, అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని అన్నారు. తన వంతుగా ఎంపీ నిధులతో విద్యాభివృద్ధి కోసం నిధులను మంజూరు చేస్తానని అన్నారు. పాఠశాల ప్రహరీ గోడ, గ్రంథాలయ భవనం నిర్మాణానికి, త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో జనగామలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏడో స్థానాన్ని పొందిన వారిని అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, సిబ్బంది శ్రీనివాస్, రంజన, సంతోష్, అమరేందర్, మండల నాయకులు స్వామి, అశోక్, సంతోష్, పొచ్చారెడ్డి ఉన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో

- సత్తా చాటిన ఎస్ఆర్ ప్రైమ్ విద్యార్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించిన జెఈఈ-2024 ఫలితాలలో ఆదిలాబాద్ ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. బి.సాయి సిద్దార్థ 94.73, ఎస్.వెంకట శ్రీఖర్ 91.20, జి.మాధవ్ 90.48, వి.రాంబాబు 90.23, ఎం.తనిష్క 85.86, సీహెచ్ జయరుద్ర 79.11, నల్ల శ్రీజ 78.34, సిందే సుఖబీర్ కౌర్ 74.23 గా అద్భుతమైన ఫలితాలను సాధించినట్లు విద్యాసంస్థల చైర్మెన్ వరదారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎస్ఆర్ విద్యాసంస్థల నుంచి ఎంతోమందిని ఐఐటీ, జేఈఈ మెయిన్స్ వంటి కాంపిటిటీవ్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తూ జిల్లా నుంచి ఎంతోమంది విద్య కుసుమాలను తయారుచేస్తున్న సంస్థగా ఏస్ఆర్ విద్యాసంస్థ నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ బ్రహ్మం, అరవింద్, జైపాల్ రెడ్డి, లెక్చరర్స్ ఉన్నారు.


## ఇంట్లోనే చదివి గ్రూప్-4లో అత్యుత్తమ ర్యాంకు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫిబ్రవరి 9న తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన యువకుడు ఏరెకార్ శ్రీకాంత్ రాష్ట్ర స్థాయిలో 228వ ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడు. డిగ్రీ పూర్తి చేసిన శ్రీకాంత్ స్వతహాగా ఇంట్లోనే చదివి అత్యుత్తమ ర్యాంకును సాధించాడు. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న యువకుడు ఎలాంటి కోచింగ్ లేకుండానే ఇంటి వద్దనే చదువుతూ గతేడాది సివిల్స్ ప్రిలిమ్స్ సాధించి మెయిన్స్‌లో స్వల్ప తేడాతో ఉత్తీర్ణత కాలేకపోయాడు. అలాగే తెలంగాణ ప్రభుత్వం రెండు సార్లు నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయి సత్తా చాటాడు. రెండు సార్లు గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు అయినా నిరాశ చెందకుండా గ్రూప్-4 చదివి రాష్ట్ర స్థాయిలో మెరిశాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంక్ సాధించిన శ్రీకాంత్‌ను కుటుంబీకులు, మిత్రులు అభినందించారు.

## నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన జి.మోహన్‌రెడ్డి



నవతెలంగాణ-తాంసి

మండల పరిషత్ కార్యాలయ నూతన ఎంపీడీఓగా జి.మోహన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. నిర్మల్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఆకుల భూమయ్య మంచిర్యాలకు బదిలీపై వెళ్లారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు.

## మున్సిపల్ కమిషనర్‌గా ఖమర్ అహ్మద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో అధికారుల బదిలీల ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. సోమవారం జిల్లాలోని పలు శాఖల్లో పని చేస్తున్న అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా మహమ్మద్ ఖమర్ అహ్మద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికొస్తున్నారు.